క్లుప్తంగా

తీవ్రవాదులను శిక్షించాలి


కదిరిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన తీవ్రవాదులను వెంటనే శిక్షించాలని కోరుతూ గురువారం రాత్రి పట్టణంలో యూటీఎఫ్ నాయకులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, మైనోద్దీన్, మల్లికార్జున,ఆజంబాషా,సునీల్ పాల్గొన్నారు.
ఓడీచెరువు: పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాద దాడి హేయమని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ అన్నారు. గురువారం రాత్రి మండలకేంద్రంలో ఉగ్రదాడిలో మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉపాధ్యాయులు వెంకటచలమయ్య, సురేష్‌బాబు, నరసింహులు, ఉమాపతి పాల్గొన్నారు
కనగానపల్లి: కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర మూకల దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులు వెలిగించుకొని స్థానిక మార్కెట్ సర్కిల్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. స్థానిక గ్రామస్తులు వీరనారాయణ, అంకె మంజునాథ్, సుబ్బరాయుడు, తిప్పయ్య, పోతలయ్య, వన్నూరప్ప, మనోహర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు అందిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందించి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. స్థానిక రోటరీక్లబ్‌లో గురువారం ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, ట్రెజరర్ సుదర్శన్‌గుప్త, సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, సత్రసాల ప్రసన్నకుమార్, కొండయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

'యశోద' విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందిస్తున్న యశోద పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: స్థానిక యశోద పాఠశాలలో గురువారం పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ అభినందించారు. పాఠశాలలో 166 మందికిగాను 590పైన ముగ్గురు, 580పైన 24 మంది, 540పైన 48 మంది మార్కులు పొందినట్లు వారు తెలిపారు.

జడ్జి రమ్యసాయికి వీడ్కోలు


జడ్జి రమ్యసాయిని సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీమ్, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శి బాలసుందరి, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆచారాలను అడ్డుకుంటే గుణపాఠం తప్పదు


మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నేతలు

కదిరి టౌన్: బ్రాహ్మణ ఆచారాలను అడ్డుకున్న వారికి గుణపాఠం తప్పదని ఖాద్రీ బ్రాహ్మణ సంఘం నాయకులు హెచ్చరించారు. గురువారం రాత్రి స్థానిక గాయత్రి కల్యాణ మండపంలో సంఘం అధ్యక్షుడు రామమూర్తి శర్మ, పీవీ శివప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలోని శివమొగ్గ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలోకి జంధ్యం తీసి రావాలని బ్రాహ్మణ విద్యార్థులకు చెప్పడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన అర్చకులు అర్చకం వెంకట నరసింహాచార్యులు, కుమార రాజాచార్యులు, జీవై పద్మనాభరావు, మురళి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారి'చోద్యం!'

బత్తలపల్లి: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇక గురువారం స్వచ్ఛాంధ్ర గ్రామీణ్ కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించారంటూ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏకంగా ఉత్తమ అవార్డు అందజేశారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ స్థాయిలో పరిస్థితులు కనిపించడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. పోట్లమర్రి, బత్తలపల్లి, వేల్పుమడుగు, సంజీవపురం, యర్రాయపల్లి తదితర గ్రామాల్లో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. బత్తలపల్లి, పోట్లమర్రి, సంజీవపురం గ్రామాల్లో పైపులైన్ దెబ్బతిని నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ విషయమై పత్రికల్లో కథనాలు వచ్చినా, మీ కోసంలో అర్జీలు ఇచ్చినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.


బత్తలపల్లి రామస్వామి గుడి సమీపంలో ప్రవహిస్తున్న మురుగు నీరు


డ్రైనేజీ లేకపోవడంతో సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


బత్తలపల్లి పాతూరులో మురుగుతో నిండిపోయిన కాలువ

విద్యార్థి హరీష్‌కు డీఈఓ అభినందన


హరీష్‌ను అభినందిస్తున్న డీఈఓ కృష్ణప్ప, సిబ్బంది


కాకతీయ పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న డీఈఓ కృష్ణప్ప, ఎంఈఓ రాజేశ్వరి

పుట్టపర్తి: పదో తరగతిలో బుక్కపట్నం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి 594 మార్కులు సాధించిన విషయం తెలిసిందే. గురువారం డీఈఓ కృష్ణప్ప హరీష్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన హరీష్ అత్యధిక మార్కులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడన్నారు. డీఈఓను కలిసిన వారిలో పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, హరీష్ తల్లిదండ్రులు ఉన్నారు.
ధర్మవరం అర్బన్: జిల్లాస్థాయిలో కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు వందశాతం ఫస్ట్‌క్లాస్‌లో పాసై మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీలో గురువారం కాకతీయ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులను డీఈఓ, ఎంఈఓ రాజేశ్వరి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు 68 మంది పదో తరగతి పరీక్షలు రాస్తే 68 మంది ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. అనంతరం విద్యార్థులు యు.విష్ణు(595), లిఖిత(590), హాసిని(584), సహన(583), కుసుమ(579)ను సన్మానించారు.

'పది'లో హరీష్ విద్యార్థుల సత్తా


టీ. చరణ్


శరణ్య


శ్రీజారెడ్డి


ఎం చరణ్


బీ.చరణ్‌తేజ్

కదిరి అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఎరుకులవాండ్లపల్లిలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కిరణ్ తెలిపారు. టీ. చరణ్ 584, శరణ్య 583, శ్రీజారెడ్డి 582 మార్కులు, ఎంచరణ్ 579, బీచరణ్ తేజ్ 575 మార్కులు సాధించారు. మొత్తం 34 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు.

ఘనంగా సత్యసాయిబాబా ఆరాధన


అన్నదానం చేస్తున్న సుబ్బదాసు భజన మందిరం సభ్యులు


బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామాప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సత్యసాయిబాబా ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 2 వేల మందికి అన్నదానం చేశారు. స్వీట్ పొంగల్, అన్నం, సాంబారు, మజ్జిగను ప్రజలకు అందించారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో సత్యసాయిసేవాసమితి సుబ్బదాసు భజన మందిరం సభ్యులు రోగులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం సుబ్బదాసు సత్రం వద్ద అన్నదానం చేశారు.

సత్యసాయికి ఘన నివాళి

పుట్టపర్తి అర్బన్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో గురువారం సత్యసాయి బాబా వర్ధంతి నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ బేగం, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ ఆధ్వర్యంలో బాబా చిత్ర పటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి బాబా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సిబ్బందికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

స్థానిక సంస్థలతో సమస్యల పరిష్కారం


ఎంపీడీఓ నరసింహనాయుడును సన్మానిస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

ఎన్పీకుంట: స్థానిక సంస్థలు బలోపేతం చేస్తే క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజినప్ప, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో పాటు పలు సచివాలయాల్లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచులు అంజినమ్మ, విష్ణుమూర్తి, పంచాయితీ కార్యదర్శులు హరీష్, ముబారక్, నాయకులు జయరాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
బత్తలపల్లి: మండలంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ సుధ పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి వివరించారు. అనంతరం అవార్డు గ్రహీతలైన ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, దంపెట్ల పంచాయతీ కార్యదర్శి భారతి, ఏఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఏపీఓ కుందానం ఆదెప్ప, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులను ఘనంగా సన్మానించారు.
నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో గురువారం పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్ బాబు, ఏఓ రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఏపీఓ మంజునాథ, ఈసీ సుబ్బారెడ్డి, టీఏలు అంజనప్ప, రమేష్, అరుణ్ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన అవసరం

నల్లచెరువు: క్షయ వ్యాధి నిర్మూలనపై గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్ఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అల్లుగుండు గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు అక్కయ్య, సుధాకర్, ఏఎన్ఎం షరీఫా, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి శాంతి ర్యాలీ వాయిదా

కదిరి టౌన్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం తలపెట్టిన శాంతి ర్యాలీని వాయిదా వేస్తున్నట్లు వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సయ్యద్ సమీవుల్లా, మౌలానా తెలిపారు. గురువారం స్థానిక జామియా మసీదులో వారు విలేకరులతో మాట్లాడారు. పహల్గాంలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడిలో మృతులకు సంతాప సూచకంగా శాంతి ర్యాలీని వాయిదా వేస్తున్నామని తెలిపారు. త్వరలో ర్యాలీ తేదీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో ఇటీవల ఒక వృద్ధురాలు, మరొకరు అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి కుటుంబాలను పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మంజునాథ్ తల్లి పూజారి నరసమ్మ మృతి చెందడంతో పూలమాల వేసి నివాళులర్పించారు. సుగాలి బాలునాయక్ (35) అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలునాయక్ తండ్రికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నరసింహులు, ఆంజనేయులు, కొండయ్య, పెద్ద నరసింహులు, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ముదిగుబ్బ: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం ఎక్సైజ్ పోలీసులు గరుగుతండా, గుడ్డంపల్లి తండాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గుడ్డంపల్లి తండాలో మూడేకులం రవినాయక్ అనే వ్యక్తి వద్ద 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అదే తండాలో 135 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మేఘావత్ వెంకటేష్ నాయక్ వద్ద 10 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు నరసింహులు, శ్రీరామ్, చంద్రమణి, సబ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

తలుపుల: నూతనకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

వడ్డీతోనే రుణాలు రెన్యూవల్ చేయాలి

తాడిమర్రి: పంట రుణాలు, బంగారు రుణాలకు వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య మేనేజర్ శ్రీనివాసరావును కోరారు. స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో గురువారం ఆయన రైతు సంఘం నాయకులు, కార్యకర్తలతో కలసి మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బీ.లక్ష్మీనారాయణ, రైతు సంఘం మండలాధ్యక్షుడు జీ.సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు బీ.నాగభూషణం, ఎస్.ధనుంజయ, ఎస్.పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో గురువారం రాత్రి ఓ మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన రాజేశ్వరి బ్రహ్మంగారి ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా పుట్టపర్తి నుంచి ధర్మవరం వైపు వచ్చే ఆర్టీసీ బస్సు రాజేశ్వరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్వరి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరంఅనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో..

ధర్మవరం రూరల్: వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన వీరాంజనేయులు అనే వ్యక్తి గురువారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వీరాంజనేయులుపొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలో ఉన్న వారు గమనించి వెంటనే గాయపడిన అతడిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కనగానపల్లి: మండల కేంద్రంలో గురువారం పోతలయ్య స్వామి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. 20 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 46 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు ఇటువంటి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుకోవాలన్నారు. అనంతరం ఆమె గ్రామంలోని రైతు అంకె వన్నూరప్ప మామిడి తోటలో దిగుబడిని పరిశీలించారు. రాప్తాడు మార్కెట్‌యార్డు చైర్మన్ సుధాకర్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, సర్పంచ్ అంకె పరిమళ, ఎంపీటీసీ భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుల ప్రదానం


జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఎల్‌పీఓ అంజనప్ప

కదిరి అర్బన్: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం కదిరి డివిజన్ డివిజనల్ లెవెల్ పంచాయితీ ఆఫీసర్ (డీఎల్‌పీఓ) అంజనప్పకు జిల్లా కేంద్రంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అవార్డు ప్రదానం చేశారు. అవార్డు రావడంపట్ల ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది డీఎల్‌పీఓకు అభినందనలు తెలిపారు.
తాడిమర్రి: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ శేఖర్‌నాయుడు, తాడిమర్రి, నిడిగల్లు, ఆత్మకూరు పంచాయితీ కార్యదర్శులకు పుట్టపర్తిలో జేసీ అభిషేక్‌కుమార్ ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. ఈఓఆర్డీగా విజయ్‌శేఖర్‌నాయుడు, తాడిమర్రి గ్రామ కార్యదర్శి రిజ్వానా బేగం, నిడిగల్లు గ్రామ కార్యదర్శి మంజుబాయి, ఆత్మకూరు గ్రామ కార్యదర్శి చంద్రకళ పంచాయితీలోని గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేశారు. అలాగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. దీంతో అధికారులు వారి శ్రమను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. ఎంపీడీఓ వెంకట రంగారావు వారికి అభినందనలు తెలిపారు.
నల్లచెరువు: పుట్టపర్తిలో గురువారం జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవంలో జేసీ అభిషేక్‌కుమార్ అల్లుగుండు పంచాయితీ కార్యదర్శి విజయ్‌కు ఉత్తమ అవార్డు అందజేశారు. ఈసందర్భంగా విజయ్‌ను రఘునాథ గుప్త, ఈఓఆర్డీ శకుంతల అభినందించారు.
పుట్టపర్తి: పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుక్కపట్నం మండలంలో పలువురు ఉద్యోగులకు కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ కుమార్ గురువారం అవార్డులు ప్రదానం చేశారు. తనతోపాటు సిద్ధరాంపురం, కృష్ణాపురం కార్యదర్శులు శంకర్, చావ్లానాయక్ అవార్డులు పొందినట్లు డిప్యూటీ ఎంపీడీఓ అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్నేహలత ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వారం రోజులుగా వివిధ పత్రికల్లో పుట్టపర్తి కమిషనర్ అవినీతిపై వరుస కథనాలు వెలువడుతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకలు సమీపిస్తున్నాయని, ఇలాంటి అధికారి ఉంటే కార్యక్రమం నిర్వహించడం సాధ్యం కాదన్నారు. కమిషనర్‌పై అమరావతిలో పురపాలక శాఖ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి గురువారం పట్టణానికి చెందిన లింగం కృష్ణమూర్తి, సుశీల దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. దాతలను షిర్డీసాయిబాబా సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు.

'సాక్షి' కార్యాలయంపై దాడి హేయం

పుట్టపర్తి టౌన్: ఏలూరు సాక్షి కార్యాలయంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేయడం హేయమని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు సద్దల ఆదినారాయణ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పత్రికల్లో వచ్చే కథనాలపై అభ్యంతరాలుంటే తెలపాచ్చని, ఇలా దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వాదులు, మీడియా స్వేచ్ఛను కోరుకునే వారు ఈ దాడి ఖండించాలని తెలియజేశారు. ఎమ్మెల్యే చింతమనేని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

కదిరి అర్బన్: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప మాట్లాడుతూ ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ. 12 వేలు అందించాలన్నారు. మండల వ్యాప్తంగా చాలా చోట్ల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్టర్లు వేస్తున్నారని పేర్కొన్నారు. పాత పనుల వద్ద ఫొటోలు తీసి బోగస్ మస్టర్లు వేస్తున్నారని చెప్పారు. అనంతరం వలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

తాగునీటి సమస్యపై సత్వరం స్పందించండి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తితే అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్వరం స్పందించాలని ఎంపీపీ గిరక రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయిమనోహర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయితీల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

నల్లమాడ: దొన్నికోట పంచాయితీ సుబ్బరాయునిపల్లిలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ రాగినేని సరస్వతి, నాయకులు నాగరాజునాయుడు గురువారం ట్యాంకర్లతో సాగునీరు సరఫరా చేసి ప్రజల దాహం తీర్చారు. సుబ్బరాయునిపల్లిలో 200 కుటుంబాలు, వెయ్యి మందికిపైగా జనాభా ఉంది. గ్రామంలో రెండు రక్షిత తాగునీటి పథకాలున్నాయి. వేసవి కావడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి పథకాల్లో నీటి లభ్యత తగ్గిపోయింది. కొన్ని రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న సర్పంచ్ రాగినేని సరస్వతి, నాయకులు నాగరాజునాయుడు సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఇంజనీర్ శశికళ, పంచాయితీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి

ధర్మవరం: కార్మికులంతా ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయు మండల కన్వీనర్ జేవి రమణ, ఎస్‌హెచ్ బాషా సూచించారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో గురువారం మే డే నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో ఏటా మే డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మిక చట్టాలను రక్షించుకునేందుకు మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయు నేతలు ఎల్.ఆదినారాయణ, మారుతి, హైదర్‌వలి, వెంకటస్వామి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు, మున్సిపల్ కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

బోర్డును పునరుద్ధరించాలి

పుట్టపర్తి టౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గురువారం ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో అన్యాయమన్నారు. నాయకులు ముత్యాలు, వెంకటేషు, బాబ్‌జాన్, మబూబ్‌బాషా, సురేష్ పాల్గొన్నారు.